క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ చౌరస్తా నుంచి ప్రిన్స్‌చౌరస్తా వరకు 33కేవీ విద్యుత్ తీగల షిఫ్టింగ్ పనుల కారణంగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు హైదరాబాద్ చౌరస్తా, మీనానగర్, తాతానగర్, జిల్లా కేంద్ర ఆస్పత్రి, పాత గ్రంథాలయం, కేకే ఆస్పత్రి, అజయ్ ఆస్పత్రి, బ్రిలియంట్ స్కూల్, హైదరాబాద్ చౌరస్తా నుంచి ప్రిన్స్‌కార్నర్ వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న అన్ని వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

భూదాన్‌పోచంపల్లి : 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మహేందర్ రెడ్డి కోరారు. ఆదివారం మండల వ్యాప్తంగా ఉన్న 50పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టి యువతీ, యువకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జనవరి 1, 2025 నాటికి 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. అలాగే ఎవరైనా కుటుంబంలో చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఏఆర్‌ఐ నర్సింహారెడ్డి, సౌజన్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న వార్డెన్ భిక్షం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ రెమి డాల భిక్షం మాట్లాడుతూ ప్రభుత్వ కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామంలో బాల వికాస్ వాటర్ ప్లాంట్ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస్ వాటర్ ప్లాంట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ స్వరూప, కార్యదర్శిగా రచ్చ వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా గనగాని యాదగిరి, డైరెక్టర్లుగా మోతె యశోద, అన్నెపర్తి పుష్పమ్మ, భట్టు ముత్తయ్య ఎన్నికయ్యారు.

బియ్యం అందజేత

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కుంకుడుపాముల సమ్మయ్య ఇటీవల మృతి చెందారు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మ, యాదయ్య దంపతులు పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింత చంద్రయ్య, నోముల సాయిలు, దేవసరి రాములు, వల్లపు యాదయ్య, ముక్కెర్ల మల్లేష్, ముక్కెర సోమయ్య, కత్తుల చంద్రయ్య, జెక్క యాదయ్య, తొంట యాదగిరి, పక్కీర్, అంజయ్య, రాములు, నరేష్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలి

ఆత్మకూరు(ఎం): బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సోమవారం మహబూబాబాద్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా పోచంపల్లి కమాన్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలకాలని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

భువనగిరిటౌన్ : గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన ఎండీ అవేజ్‌చిస్తీని ఆదివారం ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దళితసంఘం నాయకులు బట్టు రామ చంద్రయ్య షరీఫ్, మజహర్, సలీం ముల్తాని, రాషేద్, సలావుద్దీన్, అతహర్, లయీక్ అహ్మద్ ఇంతియాజ్, యూనుస్, జలీల్, సుజావద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రాజాపేట : విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పారుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన చిన్నం బాలరాజు తన గేదెను వ్యవసాయ బావి వద్ద పొలంలో మేత కోసం వదిలాడు. గేదె మేత మేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

విచ్చలవిడిగా బెల్టు దందా!

- పల్లెల్లో 24గంటలు దొరుకుతున్న మద్యం
- బెల్టుషాపులకు సహకరిస్తున్న మద్యం దుకాణాల నిర్వాహకులు
- నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు



చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పుట్టగొడుగుల్లా బెల్టుషాపులను ఏర్పాటు చేస్తున్న పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వదిలేస్తుండడంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరుకాయలుగా కొనసాగుతోంది. చౌటుప్పల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో కాట్రేవు, ఆరెగూడెం గ్రామాల్లో తప్పా మిగిలిన 24 గ్రామపంచాయతీల్లో బెల్టు దుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా బెల్ట్‌షాపుల్లో మద్యం లభ్యమవుతోంది. ఇళ్లలో, కిరాణ దుకాణాలు, టీ స్టాళ్లలో, హైవేల పక్కన చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్నారు. ఒక్కో గ్రామంలో కనీసం పది వరకు బెల్ట్ షాపులున్నాయంటే అతిశయోక్తి కాదు. అయితే ఎక్సైజ్ పోలీసు అధికారులు బెల్ట్ షాపుల్లో అడపాదడపా తనిఖీలు నిర్వహించి, నామమాత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మద్యం విక్రయాలు పెంచుకోవడానికే..

దండుమల్కాపురం, కొయ్యలగూడెం, నేలపట్ల, జైకేసారం గ్రామాలతో పాటు చౌటుప్పల్‌లో 7 మద్యం దుకాణాలతో పాటు నాలుగు బార్లు ఉన్నాయి. షాపుల యజమానులు మద్యం విక్రయాలు పెంచుకోవడం కోసం గ్రామాలో బెల్టు షాపులకు సహకరిస్తూ వారికి మద్యం అమ్ముతున్నారు. చౌటుప్పల్‌లోని ఓ వైన్ షాపు యాజమాని గ్రామాల్లోని బెల్ట్‌షాపులకే అధికంగా మద్యం సరాఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల నిర్వాహకులు ఎక్సైజ్ పోలీసు అధికారుల తనిఖీల్లో పట్టుబడితే వైన్ షాపు యాజమానులే దగ్గరుండి విడిపిస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదులు చేసినా కూడా ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా వచ్చి నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం



నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నాం. ఎక్సైజ్ అధికారులతో కలిసి బెల్టుషాపులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– మన్మథకుమార్, ఎస్‌హెచ్‌ఓ, చౌటుప్పల్

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు..

ఎన్నికల సమయంలో మునుగోడు నియోజకవర్గాన్ని బెల్టు దుకాణాలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శపథం చేశారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో మద్యం అమ్మకుండా కమిటీలు వేశారు. బెల్ట్ దుకాణాలు తొలగించాలని పలు పంచాయతీలు తీర్మానాలు సైతం చేశాయి. అయినా ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేస్తూ చాలా గ్రామాల్లో ఉదయం.. రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలు మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


ప్రవచనాలను వినిపిస్తున్న శ్రీప్రకాశానంద సరస్వతీ స్వామి

భూదాన్‌పోచంపల్లి : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకుని ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కృష్ణా జిల్లా పెనమలూరు జ్ఞాన సరస్వతీ పీఠం శ్రీ ప్రకాశానంద సరస్వతి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆధ్యాత్మిక భక్త సమాజం పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీమార్కండేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఆత్మజ్ఞాన సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు ఆధ్యాత్మిక భావనలను విస్మరిస్తున్నారని అన్నారు కోరికలను జయించలేక మానసిక సంఘర్షలను లోనవుతున్నారని అన్నారు. అందరూ భక్తిమార్గంలో నడవాలని కోరారు. అనంతరం స్వామిజీకి నిర్వాహకులు పాదపూజ నిర్వహించి పూలమాలలు వేసి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మార్కండేయ దేవాలయ కమిటీ అధ్యక్షుడు సీత సత్యనారాయణ, శ్రీ అధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, కటకం తుకారాం, చక్రాల నర్సింహ, నోముల అశోక్, వెంకటేశం, నాగేశ్వర్, సీత రాములు, గంజి బాలయ్య, చిట్టిపోలు గోవర్ధన్, రవీందర్, రుద్ర వెంకటయ్య, నర్సింహ, యాదగిరి, బొమ్మ పాండు, కొంక వీరేశం,కడవేరు ఎల్లప్ప, యాదగిరి, నర్సింహ, వెంకటేశం, ఆడెపు భావనారుషి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం


కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం): ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. దివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 15న నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు. మహాసభ జయప్రదం కోసం ప్రజల నుంచి విరాళాలను సేకరించాలన్నారు. అనంతరం మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో రచ్చ గోవర్ధన్, సత్తయ్య, తుమ్మల సత్యనారాయణరెడ్డి, చెరుకు మల్లేశం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో ఉపాధిహామీ పథకం అమలు చేయాలి


మాట్లాడుతున్న వెంకట్రాములు

భువనగిరిటౌన్ : పట్టణాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేసి కూలీలందరికీ పని కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 150 రోజుల పని దినాలు పెంచి కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను కొట్టి పెద్దలకు పెట్టే విధానాలను మరింత పెంచిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు రాచకొండ రాములమ్మ, జల్లెల్ల పెంటయ్య, గంగాదేవి సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిపంగి స్వామి, గుంటూరు శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, కూకుట్ల చొక్కా కుమారి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


మైలారంగూడెం చెరువు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని మైలార్‌గూడెం గ్రామంలో అలుగు పోస్తున్న చెరువుకు ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నీళ్లతో ఆలేరు నియోజకవర్గంలో పంటలు సమృద్ధిగా పంటలు పండుతాయన్నారు. ఆలేరు ప్రాంతంలోని ప్రతీ చెరువును గోదావరి జలాలతో నింపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం జరుగుతుందన్నారు. అలుగు పోస్తున్న చెరువులను చూసి రైతల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని తెలిపారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుందన్నారు. సన్న బియ్యానికి అదనంగా రూ. 500 బోనస్ అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజ్ గౌడ్, మదర్ డైరీ డైరెక్టర్ పుప్పాల నర్సింహులు, బండి అశోక్, దండి బాలు, కాదూరి కృష్ణ, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

బొమ్మలరామారం : కులగణన సర్వేలో నమోదు చేసుకోని కుటుంబాల వారు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శి లేదా కారోబార్లను సంప్రదించి కుటుంబ వివరాలను నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సర్వే మంగళవారం ముగయనున్న నేపథ్యంలో ఎవరైనా ఇతర ప్రాంతాల్లో ఉండి సర్వేకు రానివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అడ్డగూడూరు : సమగ్ర కుటుంబ సర్వేలో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ శంకరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలన్నారు.

భువనగిరి రూరల్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సర్వేలో ఇంకా వివరాలు నమోదు చేయించుకోని వారు మీ సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్వే నోడల్ అధికారి/మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సంప్రదించి సర్వేలో నమోదు చేయించుకోవాలి కోరారు.

మాలల 'సింహగర్జన'ను జయప్రదం చేయాలి


చౌటుప్పల్‌రూరల్ : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ మహేశ్వరం కృష్ణయ్య అన్నారు. చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం, ధర్మాజీగూడెం, ఖైతాపురం గ్రామాల్లో ఆదివారం మాలల సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ అవకాశవాద రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల లింగస్వామి, యనమల నాగరాజు, తగరం వెంకటేశం, మంత్రి యాదయ్య, రవీందర్,సంగం నర్సింగరావు, యాదయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వరహించనున్న మాలల సింహ గర్జనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని దాచారం గ్రామంలో ఆదివారం మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బోడ బాబురావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుంగ లక్ష్మయ్య, గోలి భిక్షం, కామిండ్ల నర్సయ్య, మల్లయ్య, నరేందర్, యేసయ్య, లింగయ్య, రవి, భిక్షమయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : డిసెంబర్ 1న హైదరారాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాలల సింహగర్జన సభను విజయవతం చేయాలని దళితరత్న అవార్డు గ్రహిత బోడ బాబురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాలల సింహగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జక్కుల యాదగిరి, పట్టేటి యాదగిరి, ఏసుదాసు శ్రీనురాజారావు, ఇమాన్యులు , శ్రీను, రాజారావు, ఎలిజాల కిష్టయ్య, ప్రకాశం మేకల యాదగిరి, సామేలు తదిరతులు పాల్గొన్నారు.

నిత్య ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీమాన్ నారాయణ పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు

సంస్థాన్ నారాయణపురం: నిత్య ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని శ్రీమాన్ నారాయణ పిరమిడ్ ధ్యాన మందిరం వ్యవస్థాపకురాలు దేశిడి ప్రభావతి అన్నారు. శ్రీమాన్ నారాయణ పిరమిడ్ ధ్యాన మందిరం వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం శాఖాహార ర్యాలీ ర్వహించారు. ధ్యాన మందిరం వద్ద సామూహికంగా ధ్యానం చేశారు. అనంతరం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రకృతి సహజంగా ఉండే విశ్వమయ ప్రాణశక్తి పిరమిడ్ ఆకారంలో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పిరమిడ్ లో కూర్చుని ధ్యానం చేస్తే శరీరంలోని రెండు లక్షల 72 వేల నాడులు శుద్ధి అవుతాయని, పనిచేసే సామర్థ్యం, దీర్ఘాయుష్షు లభిస్తుందని వివరించారు. పిరమిడ్ ధ్యాన మందిరంలో ఉచితంగా ధ్యాన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూమెంట్ ప్రతినిధులు దేశిడీ నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, తిరుమలనాథ పిరమిడ్ వ్యవస్థాపకుడు సతీష్, చిట్యాల పిరమిడ్ వ్యవస్థాపకుడు కిరణ్ కుమార్‌రెడ్డి, పాండు, ధాన్యలక్ష్మి, పద్మాచారి, బాలరాజు. గోపాల్, సత్తయ్య తదితరులున్నారు.

జిల్లా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

సంస్థాన్ నారాయణపురం: భువనగిరిలో ఈనెల 26న నిర్వహించనున్న తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ రాచకొండ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ రామచంద్రం,శ్రీను, యాదయ్య, నర్సింహా, జంగయ్య, పరమేష్, చిన్న నర్సింహ, వట్టిపల్లి బుచ్చయ్య, అయితరాజు నర్సింహా, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న బట్టుపల్లి అనురాధ

రామన్నపేట : ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ డిమాండ్ చేశారు. ఆదివారం మునిపంపుల గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. అనంతరం ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షురాలుగా యాదాసు శారద, కార్యదర్శిగా తాళ్లపల్లి హేమలత, ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి సంధ్య, బూడిద లక్ష్మీ, ఉంద్రాతి పూలమ్మ, సహాయకార్యదర్శులుగా ఎండీ రిజ్వానా, గంటెపాక లక్ష్మమ్మ, జోగుల ఉమ, కప్పల ఉమలు ఎన్నికయ్యారు. సమావేశంలో ఐద్వా రాష్ట్రకమిటీ సభ్యురాలుగా కల్లూరి నాగమణి, జంపాల అండాలు, జోగుల ధనలక్ష్మీ, ఎడ్ల ధనమ్మ, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

భువనగిరి : కాంగ్రెస్ మోసపూర్తి హామీలను ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ 2009లో నవంబర్ 29న దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి హాజరు కాన్నుట్లు తెలిపారు. దీక్ష దివాస్ కార్యక్రమానికి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల కమిటి అధ్యక్ష, కార్యదర్శి ఏవి కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ,మాజీ జెడ్పీటీసీ బీరు మల్లయ్య పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గుండాల : మండల కేంద్రంలో మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు జి.పాండరి, ఎంఏ.రహీం , పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షంగౌడ్, చిందం వరలక్ష్మి, ఎండీ.షర్ఫొద్దీన్, సీహెచ్.ప్రకాష్, ఎస్.రామచంద్రయ్య, డి.అయిలయ్య, ఎ.యాదగిరి, సోంమల్లయ్య, డి.లింగయ్య, పి.వెంకన్న, రాజమల్లు, రమేష్, ప్రభాకర్, బిజిలి లక్ష్మి, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జూకంటి అయిలయ్య సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆలేరురూరల్ : సీపీఎం నాయకుడు జూకంటి అయిలయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం మండలంలోని టంగుటూరు గ్రామంలో అయిలయ్య స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. దేశంలో అవినీతి పాలన కేవలం ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు వారసత్వ పార్టీలని ఎద్దేవ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమ య్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దూపటి వెంకటేష్, మల్లిఖార్జున, ఎంఎ ఇక్బాల్, సత్యరాజయ్య, తులసయ్య, ఉప్పలయ్య, రాములు, మల్లేష్, అశోక్, మాధవి, ఉదయ్, సిద్దులు, ఆంజనేయులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహా పడిపూజ

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్‌లో గురుస్వామి ప్రతికంఠం శ్యంతన్‌రాజు -పావనికోటేశ్వరి దంపతుల సౌజన్యంతో ఆదివారం అయ్యప్ప పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి అభిషేకాలను చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వామి పాండు, వెంకన్న మాలధారులు దొంతరబోయిన భాస్కర్, నాతి భిక్షపతి, మల్లం నవీన్, దుంప మణి, సిద్దు, అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని నూనెగూడెం గ్రామంలో బత్తిని రాజుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మధు, కడారు రవి, యాదగిరి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పభక్తులు అట్ల పృథ్వీరెడ్డి, పంగ శ్రీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రాజు, మణికాంత్, నరేష్, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

శ్రీకాంతాచారి వర్ధంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న శంకరమ్మ

మోత్కూరు : మండలంలోని పాడిచేడు గ్రామంలో డిసెంబర్ 3న తెలంగాణ మలిదశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కలిసి ఆహ్వానం అందజేశారు. ఆమె వెంట శ్రీకాంతాచారి సోదరుడు రవీంద్రాచారి ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

భువనగిరిరూరల్: మండలంలోని హనుమపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎర్రబోయిన రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు కన్వీనర్ కుందార కృష్ణాచారి, వలిగొండ మండల అధ్యక్షుడు కల్లూరు నవీన్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రేగు బీరప్ప, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎనబోయిన కనకరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుత నరసింహ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

భువనగిరి క్రైం : మండలంలోని హన్మాపురం గ్రామంలో ఎస్‌ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జెల్లెల పెంటయ్య, గొరిగె సోములు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో జరిగిన ఆయా సంఘాల సభ్యుల సంయుక్త సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్

భువనగిరి : జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారింది. ప్రయాణికులకు తాగునీరు అందించాలన్న లక్ష్యంతో బస్టాండ్ ఆవరణలో రెండేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చొరవతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. నాటి నుంచి వాడుకలో ఉన్న వాటర్ ప్లాంట్ గత వారం రోజులుగా పనిచేయడం లేదు. దీంతో ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


బస్టాండ్‌లో మూసి ఉన్న వాటర్‌ప్లాంట్